# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 07.04.2025 | 24 క్యారెట్లు 91,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:166

www.vishalabharati.com




## సామాన్యుడిలా సీఎం

- పేద గిరిజనుడి ఇంట సన్న బువ్వతో సహపంక్తి
- సీఎంతో పాటు సన్నబువ్వ తిన్న మంత్రులు
- కొత్తగూడెం జిల్లా సారపాకలో పర్యటన
- పేదవారి కళ్లల్లో ఆనందం చూశానన్న సీఎం రేవంత్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఓ సామాన్యుడి ఇంట్లో నేలపై కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యంతో వండిన అన్నం తిన్నారు. భద్రాచలంలో శ్రీసీతా రామచంద్రస్వామి కల్యాణోత్సవానికి హాజరైన అనంతరం ఆయన కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పంచాయతీలోని ముత్యాలంపేటలో సన్నబియ్యం లబ్ధిదారు శ్రీనివాసరావు నివాసంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భం గా శ్రీనివాసరావు కుటుంబ యోగక్షేమాల ను సీఎం అడిగి

..మిగతా 2 లో

# కమనీయం.. సీతారాముల కల్యాణం



- భద్రాచలంలో అంగరంగ వైభవంగా వేడుక
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం రేవంత్ దంపతులు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- రామ నామ స్మరణతో మారుమ్రోగిన భద్రాద్రి
- నేడు పట్టాభిషేక మహోత్సవం
- హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేలాది భక్తుల సమక్షంలో సీతారాముల కళ్యాణా న్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీస మేతంగా హాజరై సీతారాములకు పట్టువ స్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిం చారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం సంద ర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల జయ జయధ్వానాలతో మారుమోగింది. కాగా, భద్రాచలంలోని మిథిలా మైదానంలో సీతారాముల కల్యాణ వేడుకకు వేదికగా నిలిచింది. అభిజిత్ లగ్నంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ రామచంద్రమూర్తి సీతమ్మ మెడలో మాం గల్యధారణ చేశారు. ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుం డా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు

..మిగతా 2 లో

## కృష్ణాలో నీటి వాటాపై తగ్గేదేలే..

- రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకోను
- అవసరమైతే ట్రైబ్యునల్ విచారణకు నేనొస్తా
- దశాబ్దాలుగా మనకు అన్యాయం జరుగుతున్నది
- న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదు
- న్యాయ బృందంతో సమీక్షలో మంత్రి ఉత్తమ్
- కోర్టు కేసుల వివరాలన్నీ ఇవ్వాలని ఆదేశం



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కృష్ణా జలాల్లో ఏపీతెలంగాణ వాటాల పంపిణీకి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వం లోని ట్రైబ్యునల్ 2 విచారణలకు తానూ స్వయంగా హాజరవుతానని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించా రు. ఆదివారం ఆయన జలసౌధలో సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ నేతృత్వంలో కృష్ణా ట్రైబ్యునల్ 2 ఎదుట రాష్ట్రం తరఫున వాదనలను వినిపిస్తున్న న్యాయ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. న్యాయ బృందానికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. డాటా సేకరణ, క్షేత్రస్థాయి సమాచారం, పి టిషన్లను రూపొందించే విషయంలో న్యాయ బృందానికి పూర్తి సహకారం అందించాలని, వారికి అవసరమైన రవాణా, బస సదుపా యాలను కల్పించాలని అధికారులను

..మిగతా 2 లో

## 2 పథకాలకు పైసలెలా..?

- మూడు నెలల్లో రూ.15 వేల కోట్లు అవసరం
- నిధుల సమీకరణపై సర్కారు ఫోకస్
- జూన్‌లో రాజీవ్ యువవికాసం, రైతు భరోసా
- నిలిచిన భూముల అమ్మకం
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టిన అధికారులు
- పన్నుల ఆదాయం పింఛన్లు, జీతాలు, ఖర్చులకే సరి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ ప్రభుత్వం రెండు సంక్షేమ పథ కాలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. వీటి అమలు కోసం మూడు నెలల్లో దాదాపు రూ.15 వేల కోట్లు అవసరం అని తెలుస్తోం ది. ఆ నిధుల

..మిగతా 2 లో

## పర్యావరణాన్ని కాపాడుకుందాం

- హెచ్‌సీయూ విద్యార్థుల ఉద్యమానికి హ్యాట్సాఫ్
- అందరూ ఐక్యంగా నిలబడాలి
- భూముల వేలాన్ని ప్రభుత్వం నిలిపివేయాలి
- 400 ఎకరాల్లో పచ్చదనాన్ని కాపాడేందుకు పోరాడదాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

03లో



## నేడు కొత్త ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

- చేయించనున్న మండలి చైర్మన్ గుత్తా
- ఐదుగురు ఎమ్మెల్యే కోటా, ఇద్దరు ఉపాధ్యాయ, ఒకరు గ్రాడ్యుయేట్
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నా రు. రాష్ట్రం లో ఇటీవల శాసనమండలిలో ఖాళీ అయిన 8మంది ఎమ్మెల్సీ స్థానాల్లో కొత్త సభ్యులు ఎన్నికయ్యారు. వీరి లో ఎమ్మె ల్యే కోటాలో ఐదుగురు, ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు, గ్రాడ్యుయేట్

..మిగతా 2 లో

## రేవంత్ రబ్బర్ స్టాంప్


- సీఎంకు పాలనపై పట్టు లేదు
- మంత్రులను హైకమాండ్ నిర్ణయించడం విడ్డూరం
- రాష్ట్రంలో దోచుకుని ఢిల్లీకి కప్పం కడుతున్నారు
- హైదరాబాద్‌లో దేశ భక్తికి, దేశ వ్యతిరేకులకు మధ్య ఎన్నికలు
- స్వచ్ఛమైన, బలమైన పాలన కోసం బీజేపీకి మద్దతివ్వాలి
- రాష్ట్ర సర్కారుపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌ఫైర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన మీద పట్టు లేకుండా పోయిందని

..మిగతా 2 లో



## సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి
- పొలిట్‌బ్యూరోలో అరుణ్‌కుమార్‌కు చోటు
- ముగిసిన పార్టీ అఖిల భారత మహాసభలు

..మిగతా 2 లో

## బీఆర్ఎస్ సభ జరిగేనా..?

- వరంగల్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్
- 30 రోజుల పాటు మీటింగ్‌లు, ర్యాలీలపై బ్యాన్
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్
- సభ కోసం పోలీసులకు ఇప్పటికే దరఖాస్తు
- నిర్వహణకు ఇంకా రాని పర్మిషన్
- పోలీసుల తాజా ఉత్తర్వులతో సందిగ్ధంలో సభ
- 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ మీటింగ్





విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ ని ర్వహించ తలబెట్టిన భారీ బహిరంగ సభ సస్పెన్స్‌లో పడింది. పార్టీ రజితోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ జిల్లా ఎల్క తుర్తిలో సభ నిర్వహించాలని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ సభపై పెద్ద ట్విస్ట్ ఇచ్చారు వరంగల్ పోలీసులు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లుగా వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. నేటి నుంచి 30 రోజులపాటు సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉండనుందని ఆయన తెలిపారు. వరంగల్ కమి షనరేట్ పరిధిలో మీటింగులు,

..మిగతా 3 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సోమవారం,
07.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# 2 పథకాలకు పైసలెలా..?

మొదటి పేజీ తరువాయి



సమీకరణకు ప్రత్యామ్నాయ వనరులు, రుణాలపై ఆర్థిక శాఖ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని.. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా.. ఇప్పుడు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హులను ఎంపిక చేసి.. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ పథకానికి రూ.6 వేల కోట్లు ఇస్తామని స్పష్టం చేసింది. జూన్ 2 నాటికి ఈ పథకం కోసం రూ.6 వేల కోట్లు నిధులు కావాలి.

**ఖరీఫ్ రైతు భరోసాకు రూ.9వేల కోట్లు**

ఇక జూన్ నుంచే ఖరీఫ్ పంటల సాగు సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. రైతు భరోసాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు పంటలకు కలిపి.. రూ.18 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. వీటిలో రూ.9 వేల కోట్లను ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కింద వ్యవసాయ శాఖకు విడుదల చేయాలి. ఈ రెండు పథకాల అమలు కోసం జూన్ నాటికి రూ.15 వేల కోట్లను ఆర్థిక శాఖ సిద్ధం చేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిధుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కూడా మరిన్ని నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల ఒకటిన ప్రారంభం కాగా.. ఈ నెల 8న బాండ్ల విక్రయం ద్వారా రూ.2 వేల కోట్ల నూతన రుణాల సేకరణకు ఆర్థికశాఖ ప్రయత్నాలు చేస్తోంది.

**నిధుల సమీకరణపై దృష్టి..**

మరోవైపు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఈ ఏడాది ఇంధన శాఖకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించింది. వీటి నుంచి విద్యుత్ సంస్థలకు రాబోయే మూడు నెలల్లో రూ.5 వేల కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంటుంది. యువ వికాసం, రైతు భరోసా, విద్యుత్ రాయితీ నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సినవే. అందుకే వాటికే ప్రాధాన్యమిస్తూ సమీకరిస్తున్నట్లు ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

**నిలిచిన భూముల అమ్మకం..**

ప్రభుత్వ భూముల విక్రయాల ద్వారా నిధులు సమీకరించవచ్చని తొలుత భావించారు. కానీ ప్రస్తుతం అది సాధ్యం కాదని తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెడుతోంది. కొత్త రుణాల సేకరణపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, పాత రుణాలపై వడ్డీలు, అసలు కిస్తీల చెల్లింపులకే సరిపోతోందని తెలుస్తోంది. ప్రభుత్వం ప్రాధ్యాన్యత ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను.. ఇతర మార్గాల ద్వారా సమీకరించక తప్పదని అధికారులు చెబుతున్నారు. అమలు చేయాల్సిన తేదీలు దగ్గరపడుతున్న నేపథ్యంలో.. అధికారులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## రాష్ట్రంలో మూడు రోజులు వానలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో సోమ, మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఆదివారం సూచించింది. మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతుందని.. దీంతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ వరకు ఎండలు పెరుగుతాయని పేర్కొంది. కాగా.. ఆదివారం నిజామాబాద్‌లో సాధారణం కన్నా 2.2 డిగ్రీలు పెరిగి 41.5 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 1.1 డిగ్రీలు పెరిగి 41.3 డిగ్రీలు, ఖమ్మంలో 2.7 డిగ్రీలు పెరిగి 39.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# కమనీయం.. సీతారాముల కల్యాణం

మొదటి పేజీ తరువాయి

అన్నదానం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం 9 గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం కాగా, 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మిథిలా కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. కల్యాణానికి మూడు నెలల ముందే గోటితో ఒలిచిన తలంబ్రాలను దేవాలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. సీతమ్మకు ధరింపజేసే మంగళసూత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు పోగులు కలిగిన ఈ మంగళసూత్రంలో ఒకటి సీతమ్మ పుట్టింటి వారిది కాగా, మరొకటి అత్తగారింటి వారిది. మూడవ పోగును భక్త రామదాసు తయారు చేయించారు.

కల్యాణ ముహూర్త సమయం 12.02 నిమిషాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ జీలకర్ర బెల్లంను అద్దారు. ఆ తరువాత మాంగల్యధారణ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. భక్తుల రామ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సీతారాముల కల్యాణ ఘట్టం




12.40 నిమిషాలకు వైభవంగా ముగిసింది. ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేసవి వేడిని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలిరావడం విశేషం.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాముల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అటు, ప్రతి సంవత్సరము టీటీడీ తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తుంది. ఈ సందర్భంగా ముందుగా భద్రాచలం ఆలయం వద్దకు సతీసమేతంగా చేరుకున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం టీటీడీ ఛైర్మన్ దంపతులు సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

### వాడవాడలా వేడుకలు

శ్రీరామ నవమిని పురస్కరించుకొని వాడవాడలా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక వేదికలపై సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉంచి వివాహ వేడకను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిపారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఆయా ఆలయాల్లో సీతమ్మవారు, రాములవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కల్యాణోత్సవంలో పాలుపంచుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణోత్సవానికి తిలకించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.



# సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి
- పొలిట్‌బ్యూరోలో అరుణ్‌కుమార్‌కు చోటు
- ముగిసిన పార్టీ అఖిల భారత మహాసభలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శిగా మరియం అలెగ్జాండర్ బేబీ (ఎంఏ బేబీ) ఎన్నికయ్యారు. సీపీఎం 24వ అఖిల భారత మహాసభలు మదురైలో ఈ నెల 2వ తేదీ నుంచి జరుగుతున్నాయి. చివరి రోజైన ఆదివారం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికైనట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. సీతారాం ఏచూరి మరణానంతరం ఆ పదవికి ఎంఏ బేబీ ఎన్నిక కావడంతో పార్టీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే ఎం.ఎ.బేబీ రాజకీయాలపై ఆసక్తి చూపిస్తూ వచ్చారు. కేరళలోని ప్రక్కుళంలో పి.ఎం.అలెగ్జాండర్, లిల్లీ అలెగ్జాండర్ దంపతులకు 1954లో పుట్టిన ఆయన విద్యాభ్యాసం అక్కడే జరిగింది. బడిలో ఉన్నప్పుడే 'కేరళ విద్యార్థి సమాఖ్య'లో చేరారు. రాజనీతి శాస్త్రంలో బీఏ కోసం కొల్లంలోని కళాశాలలో చేరినా దానిని పూర్తిచేయలేదు. తర్వాత ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐలలో వివిధ పదవుల్లో కొనసాగారు. 1986 98 మధ్య సీపీఎం తరపున రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 200616 మధ్య రెండు విడతలు ఎమ్మెల్యేగా గెలిచారు. 2011 వరకు ఐదేళ్లపాటు కేరళ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. 2012 నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2014లో లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు.

**పొలిట్‌బ్యూరోలో ఇద్దరు తెలుగువారికి చోటు**

సీపీఎం పొలిట్‌బ్యూరోలోకి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ నాయకుడు ఆర్. అరుణ్‌కుమార్‌కు చోటు లభించింది. దీంతో ప్రస్తుత పొలిట్‌బ్యూరోలో (బీవీ రాఘవులుతోపాటు) ఇద్దరు తెలుగు వారికి చోటు దక్కినట్లయింది. అరుణ్‌కుమార్ 1974 అక్టోబర్‌లో జన్మించారు. పాఠశాల విద్య మచిలీపట్నంలో, డిగ్రీ విజయవాడలో సాగింది. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో చరిత్రలో పీజీ చేశారు. 19982002 వరకు ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. అరుణ్‌కుమార్ తల్లి హేమలత సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలిగా ఉన్నారు.

**కేంద్ర కమిటీలో తెలంగాణ నేతల ఉ**

సీపీఎం కేంద్ర కమిటీలో తెలంగాణకు గతంలో కంటే కొంత ప్రాధాన్యం పెరిగింది. సీపీఎం ఆదివారం ప్రకటించిన కేంద్ర కమిటీలో తెలంగాణ నుంచి ఐదుగురు ఉన్నారు. ఇందులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎస్.వీరయ్య, టి.జ్యోతి, సాయిబాబాకు అవకాశం లభించింది.

# సామాన్యుడిలా సీఎం

మొదటి పేజీ తరువాయి

తెలుసుకున్నారు. సన్నబియ్యం పంపిణీతో 80శాతానికిపైగా బలహీన వర్గాల్లోని నిరుపేదలు ప్రయోజనం పొందుతున్నారని సీఎం తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు తల్లి పద్మావతి విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీరాముడే సీఎంను తమ ఇంటికి పంపించాడని.. తమలాంటి నిరుపేదల కోసం ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. తన భర్త శంకర్‌రావు జీసీసీ సేల్స్‌మెన్‌గా పనిచేసి 2015లో ఉద్యోగ విరమణ పొందారని, కుమారుడు శ్రీనివాసరావు ఎంఏ, బీఈడీ అభ్యసించి ప్రస్తుతం కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, కుమార్తె కంటి సమస్యతో బాధపడుతోందని.. ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పద్మావతి తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌కు సీఎం సూచించారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రేవం



త్‌రెడ్డి నూతన వస్త్రాలు బహూకరించారు.

**పేదల కళ్లలో ఆనందం చూశానని ట్వీట్..**

రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీతో పేదవారి కళ్లలో ఆనందాన్ని స్వయంగా చూశానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సారపాకలో సహపంక్తి భోజనం అనంతరం ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సారపాకలో స్వయంగా లబ్ధిదారుల ఇంట_ _ _లో సహపంక్తి భోజనం చేసి.. పథకం అమలును స్వయంగా పరిశీలించా. వారి కళ్లలో ఆనందం చూశా" అని సీఎం పేర్కొన్నారు.

# కృష్ణాలో నీటి వాటాపై తగ్గేదేలే..

మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. ట్రైబ్యునల్ విచారణల సందర్భంగా న్యాయ బృందానికి మంత్రి పలు సూచనలు చేశారు. "తెలంగాణ వాదనలు కేవలం గణాంకాల కోసం కాదు. న్యాయం కోసం జరిపే పోరాటం. రాష్ట్ర హక్కులను కాపాడుకునే తాపత్రయం" అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధంగా.. సాంకేతిక పరంగా రాష్ట్రానికి న్యాయమైన వాటాలను దక్కించుకునేలా ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలను వినిపించాలని న్యాయబృందాన్ని కోరారు. దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు కాంగ్రెస్ సర్కారు కృతనిశ్చయంతో ఉందన్నారు. సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఇటీవల జరిగిన విచారణ వివరాలను మంత్రికి వివరించారు.

ఈనెల 15 నుంచి 17 తేదీల్లో జరిగే విచారణకు సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఇప్పటి వరకు జరిగిన విచారణల్లో తాము చేసిన వాదనలను, తాజా స్థితిగతులను వెల్లడించారు. తెలంగాణలో కృష్ణానది పరీవాహక విస్తీర్ణం, జనాభా, సాగునీటి సరఫరా సా



మర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమ కేటాయింపుల కోసం ట్రైబ్యునల్ ఎదుట వాదనలను వినిపిస్తున్నట్లు చెప్పారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# రేవంత్ రబ్బర్ స్టాంప్

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి చేతులలో కొనసాగుతుందని ప్రశ్నించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పు రస్కరించుకుని కరీంనగర్ లో పార్టీ జెండాను బండి సంజయ్ ఆవిష్కరించారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ మంత్రివర్గంలో ఎవరుండాలనేది కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుని ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతున్నారని ఆరోపించారు.

"హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం మంత్రుల కమిటీ వేసిందని... అయితే మంత్రుల కమిటీ ఏం చేయాలనేది టీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనలు ఇస్తారంటా... తెలంగాణలో రబ్బర్ స్టాంప్ పాలన కొనసాగుతుంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సొంత నిర్ణయాలు తీసుకునే స్థితిలో లేదు. తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుంది. అన్నింట్లో కమిషన్ తీసుకుంటున్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి మూటలు పంపుతున్నారు. ఈ పరిస్థితులపై తెలంగాణ సమాజం ఆలోచించాలి" అని బండి సంజయ్ కోరారు.

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ చీఫ్ మహేస్ కుమార్ గౌడ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి విచక్షణాధికారం ఆధారంగానే మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేయాల్సి ఉంటుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్‌ను మజ్లిస్ కు అప్పగించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ స్థానిక కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు దేశభక్తి గల పార్టీకి, దేశ వ్యతిరేక పార్టీకి మధ్య పోరాటం అని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావు విజయంపై బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కిలోకు రూ. 37 ఖర్చు చేస్తుండగా... రాష్ట్రం కేవలం రూ. 10 మాత్రమే అందిస్తుందని బండి సంజయ్ అన్నారు. అలాంటప్పుడు రేషన్ దుకాణాలలో ప్రధాన మంత్రి ఫోటోను ఎందుకు ఉంచకూడదని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులను కోరారు. దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్‌లు ఉన్నచోట అభివృద్ధి కొనసాగుతుందని బండి సంజయ్ అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా అవినీతి మచ్చ లేకుండా పాలన కొనసాగిస్తుందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణలో కూడా అవినీతి లేని పాలన సాగాలంటే... డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షిస్తున్నట్టుగా తెలిపారు. అప్పుడే పేద ప్రజలు ఆదుకునే రాష్ట్రంగా, అభివృద్ధి చెందే రాష్ట్రంగా... తెలంగాణ మారుతుందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో స్వచ్ఛమైన, బలమైన పాలన కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.

# బీఆర్ఎస్ సభ జరిగేనా..?

మొదటి పేజీ తరువాయి



ఊరేగింపులను నిషేధిస్తూ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉండడంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అనుమతి ఇస్తారా లేదా అనేదానిపై క్లారిటీలేదు. ఇప్పటికే సభ అనుమతి కోసం వరంగల్ జిల్లా పోలీసులకు స్థానిక బీఆర్ఎస్ నేతలు దరఖాస్తు చేశారు. అయితే సభకు వరంగల్ పోలీసుల నుంచి ఇంకా అనుమతి రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. తాజాగా పోలీసులు సిటీ పోలీసు యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేయడంతో సభ నిర్వహణకు అనుమతి కోసం బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్తారని ప్రచారం జరుగుతోంది. పోలీసులు అనుమతివ్వకపోతే కోర్టు నుంచే అనుమతి తెచ్చుకుంటారని తెలుస్తోంది.

బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు గడచిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 27వ తేదీన వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ ఇప్పటికే ప్రకటించింది. రజితోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కేసీఆర్ ప్రతిరోజు వివిధ జిల్లాల వారిగా సమావేశాలు నిర్వహిస్తూ సభ నిర్వహణపై దిశానిర్దేశం చేస్తున్నారు. గత వారం రోజులుగా సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ఆయా ఉమ్మడి జిల్లాల నేతలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోపక్క ఈ సభ అనుమతి కోసం పోలీస్ శాఖను ఇప్పటకే వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ లిఖిత పూర్వక అనుమతి కోరారు. అనుమతిపై ఇప్పటి వరకు పోలీస్ కమిషనరేట్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తాజాగా వరంగల్ కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్ అమలుతో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉంటుందా ఉండదా అనే విషయమం హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే సభ ఏర్పాట్లలో బీఆర్ఎస్ నేతలు నిమగ్నమయ్యారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు కోర్టును ఆశ్రయించనున్నట్లు సమాచారం.

గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత బీఆర్ఎస్ బలోపేతంపై గులాబీ దళపతి కేసీఆర్ తాజాగా దృష్టి కేంద్రీకరించారు. ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న ఆయన పార్టీ రజతోత్సవ సభ అనంతరం సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ప్రణాళిక రచించారు. తర్వాత గ్రామ స్థాయి నుంచి కమిటీల నిర్మాణం, జిల్లా పార్టీ కార్యాలయాలు కేంద్రంగా శిక్షణా తరగతులు నిర్వహించాలని భావిస్తున్నారు. తాజాగా ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ , నల్గొండ, ఖమ్మం జిల్లా నేతలతో సమావేశమైన కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ ప్రజలకు పాలేవో, నీల్లేవో స్పష్టంగా తెలిసిందన్నారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం శోచనీయమన్నారు. ప్రభుత్వంపై పోరాడి గెలిచిన హెచ్‌సీయూ విద్యార్థులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. భూముల విషయంలో ప్రభుత్వం వైఖరి సరి కాదన్నారు. కంచ గచ్చిబౌలి భూములపై పోరాటంలో విద్యార్థులకు మద్దతుగా నిలిచిన పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు. హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా పదేళ్ల పాలనలో తాము నిలబెడితే నిలబెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగావడంలేదని కేసీఆర్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా తెలంగాణ పరువు,ప్రతిష్టలు దిగజార్చేలా ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తుండడం శోచనీయమని అన్నారు.

# నేడు కొత్త ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

కోటాలో ఒకరు ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. సోమవా రం ఉదయం మండలి ఆవరణలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే కోటా కాంగ్రెస్ సభ్యులు అద్దంకి దయాకర్, విజయశాంతి, కేతావత్ శంకర్‌నాయక్, సీపీఐ సభ్యుడు నెల్లికంటి సత్యం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కొమురయ్య, శ్రీపాల్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నారు. బీఆర్ఎస్ సభ్యుడు దాసోజు శ్రవణ్ మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు మండలి అధికారులు వెల్లడించారు. కాగా ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు హాజరు కానున్నారు.






# కమనీయం వల్మీడి రాములోరి కళ్యాణం



- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి
- మహా అన్నదానం చేసిన హనుమాండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్

**విశాలభారతి, పాలకుర్తి**

వాల్మీకి నడియాడిన నేల వల్మీడి (వాల్మీకి పురం) గుట్టపై కొలువై ఉన్న శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణం ఘనంగా జరిగింది. స్వామి వారి కళ్యాణానికి స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డితో కలిసి హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. మరో భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన వల్మీడికి భక్తులు పోటెత్తారు. దేవాలయ



క్యూలైన్లలో వేలాది మంది భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. హనుమాండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 10వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణానికి వచ్చిన భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. మరో భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన వల్మీడిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇదే విషయమై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా పాడి పంటలు బాగా పండి, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరింత అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ట్రంప్ పిచ్చోడు



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

అమెరికన్లు కదం తొక్కారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వరదను తలపించేలా నడిరోడ్లపైకి వచ్చి.. హ్యాండ్సాఫ్ (జోక్యం వద్దు) పేరుతో భారీ నిరసనలు చేపట్టారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'పిచ్చోడు' అంటూ గేలిచేశారు. ట్రంప్‌తోపాటు డోజ్ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ప్రస్తుతం అమెరికా అధినేత ప్రతీకార సుంకాలకు దిగడంతో దేశవ్యాప్తంగా అన్ని వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. మరోవైపు.. వలస విధానాలు, ప్రభుత్వ ఉద్యోగుల కుదింపు, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడం ఇలా.. అనేక పరిణామాలను నిరసిస్తూ.. లక్షలాది మంది శనివారం రోడ్డెక్కారు. వాస్తవానికి ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అధికార పగ్గాలు చేపట్టారు. అయితే.. అత్యంత స్వల్ప కాలంలోనే ఆయనకు వ్యతిరేకంగా అమెరికా పౌరులు ఆందోళనకు దిగడంతో ప్రపంచవ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది. లాస్‌ఏంజెలెస్, బోస్టన్, న్యూయార్క్, హ్యూస్టన్, కొలొరాడో, ఫ్లోరిడా, వాషింగ్టన్ డీసీ తదితర రాష్ట్రాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. ''కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారు. అధికార అతిక్రమణలకు పాల్పడుతున్నారు'' అంటూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలు వామపక్ష నేతల ఆధ్వర్యంలో చేపట్టినట్టు స్థానిక మీడియా పేర్కొంది. గార్డియన్ మీడియా కథనం మేరకు.. వాషింగ్టన్, ఫ్లోరిడా సహా పలు రాష్ట్రాల్లో చేపట్టిన నిరసనల్లో 5 లక్షల మంది అంతకుపైగానే.. పౌరులు పాల్గొన్నారు. మొత్తంగా 50 రాష్ట్రాల్లోని 12 వందల నగరాల్లో 'హ్యాండ్సాఫ్' పేరిట నిరసనలు చేపట్టారు. ఈ నిరసనలన్నీ శాంతియుతంగానే జరిగాయని.. ఎక్కడా ఎవరినీ అరెస్టు చేయలేదని గార్డియన్ పేర్కొంది.

మస్క్ పాలసీలకు మద్దతిస్తూ ట్రంప్ కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారని నిరసనకారులు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్థం చేస్తున్నారని, వలసలు, మానవహక్కులపై ఉక్కుపాదం మోపుతున్నారని గర్జించారు. అయితే, ఈ ఆందోళనల్లో అమెరికాలోని వలసదారులెవరూ పాల్గొనలేదు. నిరసన ప్రదర్శనల్లో, అమెరికా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో వలసదారులెవరైనా పాల్గొంటే వారిని బహిష్కరిస్తామని ట్రంప్ గతంలో హెచ్చరించడమే ఇందుకు కారణం.

**'రాజ్యాధిపత్యంపై పోరాటం'**

'రాజ్యాధిపత్యంపై పోరాటం' అని రాసి ఉన్న ప్లకార్డులు సీటెల్ సహా.. పలు రాష్ట్రాల్లో కనిపించాయి. అంతేకాదు.. కొన్ని చోట్ల ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశ జాతీయ పతాకాన్ని పట్టుకుని నిరసన కారులు ఆందోళనల్లో పాల్గొన్నారు. 'హ్యాండ్సాఫ్ కెనడా, హ్యాండ్సాఫ్ గ్రీన్‌ల్యాండ్, హ్యాండ్సాఫ్ ఉక్రెయిన్' నినాదాలతో నిరసనకారులు హోరెత్తించారు. ''ట్రంప్‌కు కీలక సందేశం పంపించేందుకే హ్యాండ్సాఫ్ ఉద్యమం చేపట్టాం'' అని అమెరికా రాజకీయ నేత లీహ్ గ్రీన్‌బర్గ్ చెప్పారు. ట్రంప్‌పై నిరసన కారులు తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఆయన పేరును ప్రస్తావించకుండానే 'శ్వేతజాతి అత్యాచార నిందితులు' అంటూ నిప్పులు చెరిగారు. ''నాకు చాలా కోపంగా ఉంది. మనసు రగిలిపోతోంది. శ్వేతజాతి అత్యాచార నిందితులు మన దేశాన్ని నియంత్రిస్తున్నారు'' అని 43 ఏళ్ల షైనా కేస్నెర్ నిప్పులు చెరిగారు. చాలా మంది ''అమెరికాకు రాజు ఎవరూ లేడు'' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు.

**నిరసనలతో ఒరిగేది లేదు!**

ట్రంప్, మస్క్ విధానాలను ఎండగడుతూ లక్షల మంది ప్రజలు నిరసన చేపట్టిన నేపథ్యంలో అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నిరసనలు చేపట్టినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని స్పష్టం చేసింది. ట్రంప్ ప్రజాదరణ కూడా ఏమాత్రం తగ్గబోదని పేర్కొంది. కాగా.. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. ''నా విధానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదు'' అని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం

- హెచ్‌సీయూ విద్యార్థుల ఉద్యమానికి హ్యాట్సాఫ్
- అందరూ ఐక్యంగా నిలబడాలి
- భూముల వేలాన్ని ప్రభుత్వం నిలిపివేయాలి
- 400 ఎకరాల్లో పచ్చదనాన్ని కాపాడేందుకు పోరాడదాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



**విశాలభారతి, స్టేట్‌బ్యూరో:**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని రక్షించేందుకు అందరూ ఐక్యంగా నిలబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తాను ఓ రాజకీయ నాయకుడిగా కాకుండా సాధారణ పౌరుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా అటవీ భూములతో పాటు వన్య ప్రాణులను సంరక్షించుకునేందుకు పోరాటం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో రాసుకొచ్చారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకొచ్చిన విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, మేధావులు, జర్నలిస్టులకు తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. 400 ఎకరాల పచ్చదనాన్ని కాపాడటానికి పోరాడదామని... కంచ గచ్చిబౌలిలోని భూములు 734 జాతుల మొక్కలు, 220 జాతుల పక్షులు, 15 జాతుల సరీసృపాలు, 10 జాతుల క్షీరదాలకు జీవనాధారం అని ఆయన రాసుకొచ్చారు.

ఈ వ్యవహారంలో తమ పోరాటం ఇంకా ముగియలేదని..తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వారి స్వలాభం కోసం పర్యావరణ శ్రేయస్సును పణంగా పెట్టాలని చూడటం దురదృష్టకరమన్నారు. అభివృద్ధి ముసుగులో ఈ 400 ఎకరాల అటవీ భూమిలోని పచ్చని చెట్లను, అటవీ సంపదను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూములను కాపాడుకోవడానికి శాంతియుతంగా, దృఢ నిశ్చయంతో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యమాన్ని నడిపించారని....వారి ధైర్యానికి అభినందనలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు విలాసాలను అడగడం లేదని... కేవలం అడవిని రక్షించాలని, 400 ఎకరాల పచ్చదనాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. విద్యార్థులను నిందించబడం, వారి ఉద్దేశాలను తప్పుపట్టడం వంటివి చేస్తోందని పేర్కొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీని ఇక్కడి నుంచి వేరే చోటికి మార్చుతామంటూ విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తూ.. ఈ పోరాటం వారి నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అడవిని కాపాడకుండా ఎకో పార్క్ పేరుతో భూ ఆక్రమణకు ప్రభుత్వం కుట్ర చేస్తోందననారు. ఇది కేవలం యూనివర్సిటీపై జరిగిన దాడి కాదని... ప్రజాస్వామ్య విలువలు, పర్యావరణంపై జరుగుతున్న దాడని కేటీఆర్ లేఖలో రాసుకొచ్చారు. ఈ భూములను విక్రయించే లేదా అడవులను నాశనం చేసే ప్రాజెక్టులను చేపట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల పాటిస్తూ..భూముల వేలాన్ని నిలిపివేయాలన్నారు.



# 'కాటేరమ్మ కొడుకులు' మళ్లీ ఓడారు

- సన్‌రైజర్స్‌కువరుసగా నాలుగో ఓటమి
- గుజరాత్ గ్రాండ్ విక్టరీ
- హ్యాట్రిక్ విజయాలతో దూసుకుపోతున్న జీటీ
- గిల్, సుందర్, రూథర్ ఫొర్డ్ మెరుపులు



**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:**

వరుస ఓటములు సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కుదిపేస్తున్నాయి. ఆదివారం నాడు హైదరాబాద్‌లో గుజరాత్ తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో సన్ రైజర్స్ మళ్లీ ఓటమిపాలైంది. 153 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ 16.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించి 7 వికెట్ల తేడాతో సన్ రైజర్స్ ను చిత్తు చేసింది. ఈ ఐపీఎల్ లో సన్ రైజర్స్ కు ఇది వరుసగా నాలుగో ఓటమి. గుజరాత్ బ్యాట్స్ మెన్ లలో శుభ్ మన్ గిల్ 61, వాషింగ్టన్ సుందర్ 49, రుథర్ ఫడ్ 35 పరుగులతో చెలరేగడంతో 153 పరుగుల లక్ష్యాన్ని 16.4 ఓవర్లలోనే ఛేధించింది. హైదరాబాద్ బౌలర్లలో షమీకి 2, పాట్ కమిన్స్ కు ఒక వికెట్ పడ్డాయి. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 152 పరుగులు మాత్రమే చేసింది. కాటేరమ్మ కొడుకులుగా ఎస్ఆర్‌హెచ్ అభిమానులు పిలుచుకునే హిట్టర్లు మళ్లీ ఘోరంగా ఫెయిలయ్యారు. నితీశ్ రెడ్డి 31, క్లాసెన్ 27, కమిన్స్ 22 పరుగులు మినహా మిగతా వారెవరూ పెద్దగా రాణించలేకపోయారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ 4 వికెట్లతో చెలరేగాడు. ప్రసిద్ ,సాయి కిషోర్ లకు తలో రెండు వికెట్లు పడ్డాయి.

vishalabharathi Telugu Daily

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సోమవారం,
07.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






## యాడి జగదాంబ మాత పేరుతో విగ్రహావిష్కరణ చేయాలి

- గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రజా ప్రతినిధులు స్పందించాలి
- రాష్ట్ర సమన్వయకర్త జాదవ్ రమేష్

**డోర్నకల్, విశాలభారతి:**

గిరిజన దేవుళ్లపై కొందరు కక్ష్యపూరితంగానే వ్యవహరిస్తున్నారాని లంబాడీల ఐక్యవేదిక లైవ్ రాష్ట్ర సమన్వయకర్త గుగులోత్ రమేష్ నాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహం ఖమ్మం వరంగల్ జాతీయ రోడ్డు పై లైవ్ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నాను నిర్వహించారు. మాకుల పుణ్యక్షేత్రానికి ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని,గిరిజనులు అధికంగా పూజించుకునే మాకుల భావ్ సింగ్ భావ్ మహారాజ్ పేరును గతంలో మార్చి శ్రీ వెంకటేశ్వర స్వామిగా మార్చారని, అలాగే దండి మ్యారమా యాడి పేరును మారెమ్మగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. మా అస్తిత్వం పై జరుగుతున్న దాడిని తప్పకుండా ఎదుర్కొంటామని చట్టాలను అనుసరించి ప్రభుత్వం పై ఒత్తిడి తీస్తామని అన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే,ఎంపీలు గిరిజనులపై జరుగుతున్న దాడిని ఆపాలని వెంటనే దేవాదాయ శాఖ మంత్రి,అధికారులతో మాట్లాడి గిరిజన దేవుళ్ళ పేర్లను మార్చకుండా, వారి అస్తిత్వాన్ని కాపాడాలని కోరారు. మరిపెడ మున్సిపాలిటీ అతిథి గృహం నుండి పోలీస్ స్టేషన్ వరకు శాంతియుతంగా పాదయాత్రగా బయలుదేరి గిరిజనుల ఆస్తిత్వాన్ని కాపాడాలని,అలాగే గిరిజన దేవులపై కుట్ర పన్నుతున్న మకుల ఆలయ ఈవో, సంబంధిత అధికారులను విధుల నుండి తొలగించాలన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

**తుంగతుర్తి, విశాలభారతి:**

గానుగుబండ గ్రామంలో హనుమాన్ భక్తమండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిగింది. సీతారాముల లక్ష్మణ, ఆంజనేయుల పంచలోవ విగ్రహములు దాతగా గుండాగని బుచ్చయ్య, పుస్తె మెట్టలు దాతగా రుద్ర రామచంద్రు ఇవ్వడం జరిగింది శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండుగగా సాగింది. అభిజిత్ లగ్నంలో శ్రీరామచంద్రమూర్తి సీతమ్మ వారి మెడలో మాంగల్య ధారణ చేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తమండలి సభ్యులు, గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు

# ఘనంగా సీతారాముల కళ్యాణం

**తిరుమలగిరి, విశాలభారతి:**

తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నాడు శ్రీరామనవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా తిరుమలగిరి మండలంలో ప్రారంభమైన శ్రీరామ నవరాత్రి ఉత్సవ వేడుకలు ఆదివారం నాటితో ముగిసాయి. ఆదివారం నాడు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో మార్కెట్ యార్డ్ వద్ద ఆర్యవైశ్య సంఘం తోపాటు మున్సిపల్ కేంద్రంలోని పాతబస్తీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సీతారాముల కళ్యాణం



ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో పూజలు అందుకున్న సీతారామ చంద్రులు,నేడు కళ్యాణోత్సవ అనంతరం గ్రామంలో ఊరేగించి స్థానిక శివాలయంలో నేలకొల్పారు. ఈ సందర్భంగా జరిగిన కళ్యాణోత్సవాలను కార్యక్రమంలో భక్తులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇమ్మడి సోమ నరసయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సీతారామచంద్రస్వామి లను గ్రామంలో వాడవాడల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కోలాట నృత్యలతో పాటు భక్తి పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి సోమనసయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి నరోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్,వై రవీందర్, శ్రీను, నాని, వేల్పుల లింగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుంకరి జనార్ధన్,బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన చల్ల శ్రీలతరెడ్డి

**నేరేడుచర్ల, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా జెండా ఆవిష్కరణ చేసిన చల్ల శ్రీలతరెడ్డి ఈ సందర్భంగా శ్రీలతరెడ్డి మాట్లాడుతూ దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడంతోనే,దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మూడు పర్యాయాలుగా అవినీతి లేకుండా దేశంలో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఇట్టి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నేరేడుచర్ల పట్టణ గరిడేపల్లి, పాలకవీడు మండల అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నరినాయక్, జిల్లా కౌన్సిల్ మెంబెర్స్ సత్యనారాయణరెడ్డి, విజయ్, బిజెపి నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, అశోక్, పోకల వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, జెనిగల శ్రీను, మెట్టు మధు సోమయ్య, నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగయ్య, శంకర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, నాగయ్య, సైదులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరాజుపల్లిలో ఘనంగా రాములోరి కళ్యాణం

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో శ్రీ భక్త హనుమాన్ మందిరం వద్ద, శ్రీరామనవమి సందర్భంగా, శ్రీరామ కమిటీ ఆధ్వర్యంలో, శ్రీ సితారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సర్వాంగ సుందరంగా పెండ్లి మండపం ముస్తాబు చేసి అంగరంగ వైభవంగా వైభవోపేతంగా, తలంబ్రాలు పట్టు వస్త్రాలు సమర్పించుకుని పురోహితులు వేద మంత్రోత్సవాల మధ్య జరిగిన సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని అధిక సంఖ్యలో హాజరైన అశేష భక్త జనం ప్రత్యక్షంగా వీక్షించి పునీతులయ్యారు, ఈ సందర్భంగా శ్రీ రామ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరంగా జరుపుకుంటున్నాం, కొన్ని సంవత్సరాల నుండి దాతల సహాయంతో అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామచం



ద్రుని కోరికలు కోరుకున్నారు. అనంతరం దాతల సహాయంతో ఏర్పాటు చేసిన మాహ అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు స్వీకరించారు ఈ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసినా భక్తులందరికీ, దాతలుగా ముందుకు వచ్చి సహకరించిన భక్తులకు, గ్రామ ప్రజలకు, అందరికీ దేవుని ఆశీస్సులు మన అందరి పైన ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండి మన జీవన సహనం ముందుకు సాగాలని కోరుకుంటూ శ్రీరామ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.



## అంగార వైభవంగా రాములోరి కల్యాణ మహోత్సవం

- కోదండ రాముని దర్శించుకున్న పేరూరు ఎస్ఐ గుర్రం కృష్ణ ప్రసాద్ దంపతులు

**వాజేడు, విశాలభారతి:**

మండల పరిధి గ్రామాలలో శ్రీ శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం అంగర వైభవంగా జరిగింది. శ్రీరామనవమి మహోత్సవాలు వాజేడు మండల పరిధి గ్రామాలలో చంద్రపట్ల, పేరూరు ,ధర్మారం, పెద్ద గొల్ల గూడెం, చీకుపల్లి, వాజేడు గ్రామాలలో శ్రీ రామనవమి శ్రీ సీత రామ లక్ష్మణ సామెత కళ్యాణ మహోత్సవం ప్రజలు ఆనందంగా వైభవంగా జరుపుకున్నారు. పలు గ్రామాలలో కల్యాణ మండపాలు ఏర్పాటు చేసుకొని శ్రీ సీతారామ విగ్రహాలకు కల్యాణ మహోత్సవం తిలకించి అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పేరూరు గ్రామంలో వెలిసిన వంటి కోదండ రామయ్య ఆలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ దంపతులు దర్శనం చేసుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు.



## దేశమే ముందు ఆ తర్వాతే దేహమైన, కుటుంబమైన

**తొర్రూరు, విశాలభారతి:**

ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయినా భారతీయ జనతా పార్టీ దేశమే ముందు ఆ తర్వాతే దేహమైన కుటుంబం అయినా అనే సిద్ధాంతంతో జాతీయవాద భావనలతో జాతీయ సమైక్యత పట్ల నిబద్ధతతో ప్రగతిశీల దృక్పథంతో ప్రజాస్వామ్య పద్ధతులతో లౌకిక వాదాన్ని అలంబనంగా చేసుకొని రాజ్యాంగ స్ఫూర్తిని అండగా మలుచుకొని విలువలతో కూడిన రాజకీయాలతో సుపరిపాలన అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ తొర్రూరు అర్బన్ శాఖ ఆధ్వర్యంలో అర్బన్ అధ్యక్షుడు పైండ్లరాజేష్ పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఈ ప్రోగ్రాం కన్వీనర్ జిల్లా కార్యదర్శి కలుపుల శంకర్ ముఖ్యఅతిథి గా పాల్గొన్న పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమన్ జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ పల్లె కుమార్ ఎస్సీ మోర్చా పార్లమెంట్ ఇంచార్జ్ అలిసేరి రవిబాబు మహిళా మోర్చా అధ్యక్షురాలు దూకుంట్ల విజయ ప్రోగ్రాం కో కన్వీనర్ జలగం రవి,మండల నాయకులు గడ్డల శేఖర్,గట్ల భారత్, అధ్యక్షుడు శీలం శ్రీనాథ్,ఔట్రీచ్ కన్వీనర్ నూకల నవీన్,గంధం రాజు, తూర్పాటిసాయి,ముకేష్, పాపుశేటి సంతోష్,శివ కుమార్,శ్రీనివాసచారి, గంధం రాజు,చలపతి రాజు, నడిగడ్డ సందీప్,హరీష్, సునీల్,సుస్రూత్,శోభ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చౌటుప్పల్, విశాలభారతి:**

మున్సిపాలిటీలోని 13వ వార్డులో బిజెపి పార్టీ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 45వ అభిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ భారత రత్న మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి, లాల్ కృష్ణ అద్వానీ లచే 1980 ఏప్రిల్ 6 న భారతీయ జనతా పార్టీ స్థాపించబడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు రామనగోని శంకర్, ఓబీసీ మోర్చా యాదాద్రి జిల్లా కార్యదర్శి దానోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉడుగు వెంకటేశం ,కట్ట కృష్ణ,కాసుల వెంకటేష్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య యాదవ్, బండారు మహేందర్ రెడ్డి, బుడ్డ సురేష్,బాతరాజు సంజీవ, బూత్ అధ్యక్షులు సత్తిరెడ్డి , ఇటకాల దామోదర్ రెడ్డి, అన్న మోని రాజేష్ ,మార్గం స్వామి మరియు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

- అతిథులుగా విచ్చేసిన ఎస్సై రాజ్ కుమార్
- అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఆర్ఐ విద్యార్థి ఇల్లా నవీన్

**పినపాక, విశాలభారతి:**

మండలంలోని గోపాలరావు పేట గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు నడుమ స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామ నామంతో భక్తులు పరవశించారు. కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన ఏడూళ్ల బయ్యారం ఎస్ఐ ఇమ్మడి రాజ్ కుమార్ కు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికి సాలువాతో సత్కరించారు. సీతారాములను దర్శించుకున్న రాజ్ కుమార్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.వారు మాట్లాడుతూ మండల ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. గోపాలరావు పేట గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీని అభినందించారు. భక్తులకు రుచికరమైన అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించిన ఎన్ఆర్ఐ విద్యార్థి ఇల్ల నవీన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కూనరపు సత్యనారాయణ, బుస్సీ శ్రీనివాస్, కటకం గణేష్, బొలిశెట్టి ప్రభాకర్, ఉడుగుల రామచంద్రు, గాడుదుల కృష్ణ, కొంపెల్లినాగేశ్వరరావు, అనుపెద్ది బాబురావు, కేప సతీష్, మార్త మనోజ్, అంకతి సమ్మయ్య, పాత్రికేయులు కొంపెల్లి సంతోష్, కన్నె రమేష్ గాడుదుల దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున పాఠశాల 35వ వార్షికోత్సవ వేడుకలు

- తల్లిదండ్రుల కోరిక మేరకే విద్యానగర్లో 2వ బ్రాంచ్
- విజ్ఞానం, క్రమశిక్షణ ఉత్తమ విలువలు అందించడం మా ప్రత్యేకత
- మారేపల్లి మల్లారెడ్డి పాఠశాల చైర్మన్

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని మల్లికార్జున పాఠశాల యాజమాన్యం 35వ వార్షికోత్సవాన్ని యస్ ఎం రెడ్డి గార్డెన్లో ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో మల్లికార్జున పాఠశాలల చైర్మన్ మారెపల్లి మల్లారెడ్డి పాల్గొని తదినంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో చదువు కొరకు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టిలో ఉంచుకొని అందరికి విద్యను అందించాలనే పట్టుదలతో మల్లిఖార్జున ఉన్నత పాఠశాలను 1990 లో స్థాపించాము. ఆరోజు నుండి అనేక ఆటుపోటులు ఎదుర్కోంటు పాఠశాలను ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్నాము. ఎస్ఎస్సి పరీక్షలలో పలుమార్లు మండల స్థాయి,జిల్లాస్థాయి, మరియు రాష్ట్రస్థాయిలో రాణించి గౌరవాన్ని పొందాము.ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయ సహాకారాలు అందిస్తూన్నాము. 202122 విద్యా సంవత్సరంలో తల్లిదండ్రుల, శ్రేయోభిలాషుల కోరిక మేరకు విద్యానగర్లో ఒక బ్రాంచ్ని స్థాపించడం జరిగింది. ప్రతి విద్యార్థికి విజ్ఞానం, క్రమశిక్షణ, ఉత్తమ విలువలు అందించడం మా పాఠశాల ప్రత్యేకత, నూతన తరానికి అణుగునంగ సమగ్ర విద్యను, పాఠ్యాంశాల కృత్యాలను, తల్లిదండ్రులకు తెలియపరుస్తున్నాము. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధీర్, విద్యానగర్ బ్రాంచ్ ప్రధానోపాధ్యాయులు తోట లక్ష్మిదేవి, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రీయోభిలాషులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు

**తుంగతుర్తి, విశాలభారతి:**

గానుగుబండ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షులు శీలం లింగయ్య గౌడ్ పార్టీ జెండా ఎగరవేశారు. పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి మిఠాయిలు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఎనగందుల రామచందర్. పంజాల సతీష్.పంజాల రమేష్ పంజాల వెంకటేశ్వర్లు. సీస ఉపేందర్. బోయిని వెంకట పాపులు. సోమనారి. బొల్లోజు ఉపేందర్ మహేష్. మామునూరి ఉప్పలయ్య. గుండగాని మురళి. పంజాల సోమనారి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ది వినాయక ట్రేడర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**చౌటుప్పల్, విశాభారతి:**



పట్టణ కేంద్రంలోని సిద్ధి వినాయక ట్రేడర్స్ ప్రొప్రైటర్ జంగిలి మహేష్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా అక్కడికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ మండల ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోర్కే నాగరాజు, సిద్ధి వినాయక ట్రేడర్స్ సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.





# శ్రీ రాముడి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- **కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్**
- **శ్రీ సీతరాముల కళ్యాణ మహోత్సవాలలో పాల్గొన్న నీలం**

**పటాన్ చెరు,విశాలభారతి**

శ్రీ సీత రాముళ్ళ ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్ చెరు పరిధిలోని ఇంద్రేశం గ్రామం పిఎన్ఆర్ టౌన్షిప్ కాలనీ, చిట్కుల్ గ్రామం వేణుగోపాలస్వామి ఆలయం, వడ్డెర కాలనీ, ఇస్నాపూర్ గ్రామంలో రామాలయం వద్ద మాజీ సర్పంచ్ గడ్డం శ్రీశైలం ఆధ్వర్యంలో, హనుమాన్ దేవాలయం వద్ద మాజీ ఉపసర్పంచ్ శోభకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, క్యాసారం గ్రామంలో కాసా రాజు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇస్నాపూర్ క్రాస్ రోడ్ లో తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల యూనియన్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంధర్బంగా నీలం మధు మాట్లాడుతూ ధర్మానికి, నీతికి,విలువలకు, సుపరిపాలనకు నిలువుటద్దం శ్రీ రాముడన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీ రాముడి లాగా సుపరిపాలన అందిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దేశం అబ్బురపడేలా పాలన కొనసాగిస్తూ దశాబ్దాల సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇందుకు బీసీ కులగణన చేపట్టడంతో పాటు బీసీ రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడమే నిదర్శనమన్నారు.ఆ జగదాబి రాముడి అనుగ్రహంతో ప్రజలంతా కష్టాలు తొలిగి, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం డబ్బులు చెల్లించాలి

- **గత ఏడాది మూల్యాంకనం డబ్బులు ఇవ్వకుండానే మళ్ళీ మూల్యాంకనం ఉత్తర్వుల పట్ల అసంతృప్తి**
- **రెండు సంవత్సరాల డిఎ ,టీఏ లు ఇవ్వలేదని ఆవేదన**
- **విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఎస్టియూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం డబ్బులు వెంటనే చెల్లించాలని రాష్ట్రపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎస్టీయూ భవన్ లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం మూల్యాంకనం డబ్బులు ఇవ్వకుండానే మళ్ళీ మూల్యాంకన ఉత్తర్వులు ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరం డబ్బులు పూర్తిగా ఇవ్వలేదని, ఆపై రెండు సంవత్సరాల డిఎ, టీఏ లు ఇవ్వలేదని అన్నారు. చిన్న పిల్లలు కూర్చొనే బల్లలపై, మండు వేసవిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉపాధ్యాయులు అనారోగ్యం పాలైన సందర్భాలు అనేకం ఉన్నాయని వారు తెలిపారు. సెలవులు లేకుండా, సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోతలో మూల్యాంకనం నిర్వహించిన ఉపాధ్యాయులకు న్యాయంగా రావలసిన డబ్బులు సంవత్సరం గడిచినా ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వెలిబుచ్చారు. మూల్యాంకనం రేట్లు పెంచాలని, సెలవు దినాలలో పని చేసినందుకు పరిహారపు సెలవు (సీసీఎల్) ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి ప్రత్యేక చొరవ తీసుకొని అంధులు, వికలాంగులు, అనారోగ్య ఉపాధ్యాయులకు విధుల నుండి మినహాయింపు ఇవ్వడం పట్ల హర్షం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టియూ నాయకులు బాలకృష్ణ, జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్, తిరుమలేష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు..



శ్రీ రామనవమి సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం లోని వివిధ గుడిలలో శ్రీరాముని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదాం. సంతోష్ కుమార్.

**సికింద్రాబాద్,విశాలభారతి:**



## నేడు ఎల్బీనగర్ నియోజకవర్గంలో జిల్లా ఇన్చార్జి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు పర్యటన

- **మంత్రి శ్రీధర్ బాబు పర్యటనను విజయవంతం చేయండి.**
- **రూ.110 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**
- **అభివృద్ధి పనుల శంకుస్థాపనలలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు మధుయాష్కీ గౌడ్ పిలుపు.**
- **హస్తినాపురంలో శ్రీధర్ బాబు సభ ఏర్పాట్లను పరిశీలించిన మధుయాష్కీగౌడ్.**

**ఎల్బీనగర్ విశాలభారతి :**

ఎల్బీనగర్ నియోజకవర్గం లో రూ.110 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు నేడు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు దుదిల్ల శ్రీధర్ బాబు హాజరవుతున్న నేపథ్యంలో మంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లను టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పరిశీలించారు. శంకుస్థాపనల చివరి కార్యక్రమమైన హస్తినాపురం డివిజన్ భీమా నగర్ చౌరస్తాలో సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడ చేపట్టవలసిన ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. మంత్రి పర్యటనకు సంబంధించి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడారు.

**మంత్రిగారి పర్యటనను విజయవంతం చేయండి..**

జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధుయాష్కీ గౌడ్ సూచించారు. ఐదు చోట్ల ప్రారంభోత్సవాలు శంకుస్థాపన చేపడుతున్న నేపథ్యంలో చైతన్యపురిలోని శివాజీ విగ్రహం చౌరస్తా వద్ద మంత్రి గారికి ఘన స్వాగతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ మంత్రి తో కలిసి భారీ ర్యాలీతో కొత్తపేట సప్తగిరి కాలనీ, మనసురాబాద్ సహారా రోడ్డు, లింగోజిగూడ గౌతమ్ నగర్, వనస్థలిపురం క్రిస్టియన్ కాలనీ, హస్తినాపురం భీమా నగర్ చౌరస్తాలలో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**కాలనీ సంక్షేమ సంఘాలకు ఆహ్వానం.**

ఎల్బీనగర్ నియోజకవర్గంలో రూ.110 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల కార్యక్రమాలలో ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలని మధుయాష్కి గౌడ్ ఆహ్వానించారు. గత పదేళ్లలో రాని నిధులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో 15 నెలల్లో ఎల్బీనగర్ నియోజకవర్గానికి వచ్చాయని ఆయన వివరించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా నడిపిస్తుందని వివరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అండగా నిలబడాలని సూచించారు. మంత్రిగారి పర్యటనలో అందరూ భాగస్వామ్యం కావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్యనారాయణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆలే వెంకట్ రెడ్డి,దాము మహేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్కీ సిద్దార్థ మృతి బాధాకరం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**



మంచాల మండలం ఆగపల్లి గ్రామానికి చెందిన బుర్ర మనీలా రాజు దంపతుల కుమారుడు లక్కీ సిద్ధార్థ అనారోగ్యంతో మృతి చెందాడు. సిద్ధార్థ కుటుంబానికి మహిళా కాంగ్రెస్ నేతలు అండగా నిలిచారు. మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షురాలు లక్కుమల్ల కల్పన, ఏ బ్లాక్ అధ్యక్షరాలు దూసరి లావణ్య బాల శివుడు గౌడ్ లు సిద్ధార్థ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారిని ఓదార్చి బియ్యం, నూనె, నిత్యావసర వస్తువులు అందజేశారు.



## సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న సుధా శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు,విశాలభారతి:**

శ్రీరామనవమి సందర్భంగా అమీన్పూర్ మున్సిపాలిటీ, ఇస్నాపూర్ లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమీన్పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, లింగమయ్య కాలనీ, టైలర్స్ కాలనీ, సెంథన్ గ్రీన్ హోమ్స్, పటేల్‌గూడ గ్రామం, హరివిల్లు టౌన్షిప్, పటాన్చెరు మండలంలోని ఇస్నాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం మరియు రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ మహోత్సవాలకు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హాజరై సీతారాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట సుధా మాట్లాడుతూ మాట్లాడుతూ.. “సీతారాముల దివ్య కల్యాణాన్ని తిలకించడం అదృష్టమని, పుణ్యదంపతులైన సీతా రాముల ఆశీస్సులతో అందరి జీవితాల్లో శాంతి, సంపత్తి, సంతోషం వెల్లివిరియాలని కోరారు. కార్యక్రమాల్లో బీరంగూర గుట్ట ఆలయం చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి, మన్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





## శాతావాహన కాలనీలో వైభవంగా సీతారాముల కళ్యాణం

- **భారీ సంఖ్యలో పాల్గొన్న కాలనీ వాసులు, ఘనంగా శోభాయాత్ర.**

**విశాలభారతి,ఎల్బీనగర్ :**

శ్రీరామ నవమి సందర్భంగా ఆది దంపతులు సీతారాముల కల్యాణం ఆదివారం ఎల్బీనగర్ పరిధిలోని శాతవాహన నగర్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతమ్మ తరపున ఇంగువ కృష్ణ ప్రసాద్, అరుంధతి దంపతులు, శ్రీరాముడి తరపున పర్వతాల చంద్రశేఖర్రెడ్డి, సులోచన దంపతులు కల్యాణ తంతు నిర్వహించారు. శాతావాహన నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, కల్యాణ మహోత్సవ నిర్వాహకులు ఎన్. జగదీశ్ రెడ్డి, ఆర్వై. భరత్కాంత్రెడ్డి ఆధ్వర్యంలో రామయ్యకు భద్రాద్రి నుంచి తెప్పించిన ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కళ్యాణం అనంతరం భక్తులకు, తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గత ఏడాది నుంచి శాత వాహన నగర్ లో సీతారాముల కల్యాణం ఎంతో వైభవంగా జరిపిస్తున్నామని చెప్పారు. ముందు ముందు ఇంకా ఘనంగా నిర్వహిస్తామని వారు చెప్పారు. సాయంత్రం సీతారాముల శోభాయాత్ర శాతవాహన నగర్ లో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ సమితి సభ్యులు టి. కరుణాకర్రెడ్డి, ఎన్. నరసింహరాజు, వి. శ్రీకాంత్రెడ్డి, కె. సంతోష్కుమార్, ఎస్. రవికుమార్, ఎన్. శ్రీధర్రాజు, ఇవి.రమణాచారి, ఎ. సుధాకర్రెడ్డి, ఎస్. శశిధర్రాజు, ఆర్ ఆది నారాయణ రాజు, ఎం. లక్ష్మణ్రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
07.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఘనంగా భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం



మునుగోడు, విశాలభారతి:
మండల కేంద్రంలో ఆదివారం బిజెపి వ్యవస్థాపక దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షులు పెంబళ్ళ జానయ్య పార్టీ జెండా ఎగుర వేశారు. స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు ప్రతి ఇంటిపై బిజెపి జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మాధగోని నరేందర్ గౌడ్. సీనియర్ నాయకులు పందుల నరసింహ. మండల ప్రధాన కార్యదర్శి అక్కేనపల్లి సతీష్. మండల ఉపాధ్యక్షులు ఏర్పుల క్రాంతి కుమార్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు పందుల యాదయ్య, ఒంపు తరుణ్. తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రాముని చల్లని దీవెనలు ప్రజలందరి మీద ఉండాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు.

ఎల్బీనగర్, విశాలభారతి :
శ్రీరాముని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని శ్రీసీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన అన్నారు. సకల గుణ సంపన్నుడు శ్రీరాముడు. రామచంద్రుడికి ఎన్ని కష్టాలు ఎదురైనా ఏనాడూ ధర్మం వీడలేదని, అబద్ధం ఆడలేదు. ప్రజారంజక పాలకుడు శ్రీరాముని జీవితం తరతరాలకు ఆదర్శనీయమని, ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటూ అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవిఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న ఆయన కుమారుడు కోడలు సాయి కిరణ్ ,శార్వరి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు





## పటాన్ చెరు నియోజకవర్గంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- కనుల పండుగ సీతారాముల కళ్యాణం
- భక్తులతో కిటకటలాడిన దేవాలయాలు
- పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే 'గూడెం' దంపతులు

పటాన్ చెరు,విశాలభారతి
పటాన్ చెరు నియోజకవర్గంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. సీతారాముల కళ్యాణంతో ఆలయాలు రామనామస్మరణతో మార్మోగాయి. సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కళ్యాణాన్ని తిలాకించేందుకు ఆలయాలకు భక్తులు భారీగా తరలించారు. పటాన్ చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. మహిపాల్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. రామచంద్రాపురం పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ శివాలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో పటాన్ చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ రామాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, మ్యాక్ సొసైటీ, బృందావన్ కాలనీ, ఎం.ఐ.జి కాలనీలో వివేకానంద గ్రౌండ్, రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వారు పాల్గొని రాముల వారిని పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, మాజీ జెడ్పిటిసి జైపాల్, మాజీ సర్పంచ్ దేవేందర్ రాజు, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

**బండలగూడలో కనుల పండువగా సీతారాముల కళ్యాణం..**

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని బండల గూడ శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదగిరి యాదవ్ కుటుంబ సమేతంగా తన ఇంటి నుండి పట్టు వస్త్రాలతో ఆలయం వరకు ఒరేగింపుగా వచ్చి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లకు పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.



శ్రీరామనవమి వేడుకలు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్

## మదినగూడలో ఘనంగ శ్రీరామ నవమి వేడుకలు

శేరిలింగంపల్లి,విశాలభారతి:
హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని మదినగూడ గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో భాగంగా ఆలయాలను నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు భారీగా ఆలయాలకు తరలి వచ్చి దేవతామూర్తులను దర్శించుకుంటున్నారు.స్వాగత తోరణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణం కోసం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్చరణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం జరిగింది.సీతారాముల కల్యాణం చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు.వారిలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, ఎంబీసీ చైర్మన్ వద్దే జైపాల్ , ఎస్సీ,ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్,వాల హరీష్ రావు ,యువ నాయకుడు ధాత్రీ నాథ్ గౌడ్,ప్రతాప్ రావు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని మదినగూడ గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో భాగంగా ఆలయాలను నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు భారీగా ఆలయాలకు తరలి వచ్చి దేవతామూర్తులను దర్శించుకుంటున్నారు.స్వాగత తోరణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణం కోసం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చారు.ఉదయం 11 గంటల ప్రాంతంలో భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్చరణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం జరిగింది. సీతారాముల కల్యాణం చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు.వారిలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బ్యాక్ వార్డ్ చైర్మన్ వద్దే జైపాల్, ఎస్సీ,ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్,వాల హరీష్ రావు,యువ నాయకుడు ధాత్రీ నాథ్ గౌడ్,ప్రతాప్ రావు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న బోయిన్పల్లి వినోద్ రావు



## ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- రాములోరి కళ్యాణ వేడుకలకు ప్రత్యేక అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి,విశాలభారతి:
కూకట్పల్లి గ్రామంలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో భాగంగా ఆలయాలను నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు.వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూకట్పల్లిలోని పలు ప్రాంతాల్లో భక్తులు భారీగా ఆలయాలకు తరలి వచ్చి దేవతామూర్తులను దర్శించుకుంటున్నారు. స్వాగత తోరణాలను విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరించారు. సీతారాముల కల్యాణం కోసం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చారు.ఉదయం 11 గంటల ప్రాంతంలో భాజాభజంత్రీలు వేదమంత్రోచ్చరణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం కనుల పండుగగా జరిగింది.సీతారాముల కల్యాణం చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనాలను వడ్డించారు.



## బీటీ రణధీవే స్ఫూర్తితో సామాజిక న్యాయ సాధన కోసం పోరాడుదాం

మునుగోడు, విశాలభారతి:
సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బీటీ రణదేవే స్పూర్తితో సామాజిక న్యాయ సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు మునుగోడు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బీటీ రణధేవే 35 వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికరంగా శ్రమను దోచుకొని బడా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ కార్మికుల హక్కులను కాలరస్తున్న బిజెపి ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.కార్మిక వర్గాన్ని కులాల పేరుతో, మతాల పేరుతో చీల్చి కార్పోరేట్ శక్తులు తమ దోపిడీ కొనసాగిస్తున్నాయని అన్నారు . మనువాదాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకుందామని మహిళల, మైనారిటీల, దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులను ప్రతిఘటిస్తూ మనుషులంతా ఒక్కటే అంటూ సామాజిక న్యాయం కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సిఐటియు పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్ , మండల కమిటీ సభ్యులు మిర్యాల భరత్ , వేముల లింగస్వామి , యాట రాజు , యాస రాణి వంశీ తదితరులు ఉన్నారు.



శ్రీరామనవమి వేడుకలలో టీపిసిసి మాజీ కార్యదర్శి, ఎల్ బి నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్



## జ్యూవెలరీ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నాచారం, విశాలభారతి:
మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ వసుంధర కాలేజ్ ఎదురుగా త్రిష్ల జ్యూవెలరీ షాప్ ను ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం వారు యజమాని అనిల్ జైన్ కి మంచి లాభాలతో వ్యాపారం సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మార్వాడి సంఘం అధ్యక్షులు కైలాష్ శర్మ మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, చారి, బాలయ్య గౌడ్, నవీన్ గౌడ్, పూస రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

సికింద్రాబాద్, విశాలభారతి:
బీజేపీ స్థాపించి 45 సంవత్సరాల సందర్భమున సీతాఫల్ మండి చౌరస్తా లో మూట గణేష్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెండా ఆవిష్కరణ చేయగా డివిజన్ అధ్యక్షుడు నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకట్ల హరి, రాచమల్ల కృష్ణ మూర్తి,అసెంబ్లీ కన్వీనర్ కందడి నాగేశ్వర్ రెడ్డి,ప్రభు గుప్త ,జిల్లా కార్యవర్గ సభ్యుడు నీలి శ్రీనివాస్, మాజీ ,అధ్యక్షుడు అంబలా రాజు, సోన బోయిన బోయిన కుమారస్వామి,వెంపటి భాస్కర్,నాగరాజు కంటే ఆకుల సంపత్, కిట్టు, యుద్ధవీరు మంగళి పల్లి రాజామౌళి,గోవింద, తదితరులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సోమవారం,
07.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

- మల్లాపూర్ డివిజన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర




నాచారం,విశాలభారతి:

ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కోర్డినేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్ర ప్రారంభానికి ముందు, వారు గాంధీ మరియు బాబు జగ్జీవన్ రామ్ ,డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. వారి ఆశయాలను స్మరించుకుంటూ, రాజ్యాంగ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించే గొప్ప పత్రిక. ఇది మన దేశాన్ని ప్రజాస్వామ్య మార్గంలో ముందుకు నడిపే దీపస్తంభం.అలాంటి రాజ్యాంగాన్ని రక్షించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత" అని అన్నారు.ఈ పాదయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం కల్గించి, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టబడిందని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రాములోరి శోభాయాత్ర



విశాలభారతి,భీమదేవరపల్లి:

శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముడి శోభాయాత్ర ముల్కనూర్ లో శ్రీ సాంబ మూర్తి దేవాలయం నుండి బస్టాండ్ వరకు కన్నుల పండువగా కొనసాగింది. ముల్కనూర్ హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. జైశ్రీరామ్ నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. యువత కాషాయ జెండాలు పట్టుకొని జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.







# దేశీ విత్తనాలు రక్షించుకోవాలి


- లంగాణ వ్యవసాయం రైతు సంక్షేమ కమిషన్ చైర్ పర్సన్ ఎం. కోదండ రెడ్డి
- ముగిసిన విత్తనాల పండుగ

అమనగల్లు, విశాల భారతి:

కల్తీ విత్తనాల నిర్మూలన, రైతుకే విత్తన హక్కు అన్న అంశాలకు చట్ట రూపం ఇచ్చి దానిని అమలుపరిచినప్పుడే దేశీ విత్తనాలను రక్షించుకోగలుగుతామని తెలంగాణ వ్యవసాయం రైతు సంక్షేమ కమిషన్ చైర్ పర్సన్ ఎం. కోదండ రెడ్డి అన్నారు.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సిజీఆర్ & భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కడ్తాల్ మండలం, అన్మాస్ పల్లిలో నిర్వహిస్తున్న విత్తన పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మూడు రోజుల విత్తన పండుగ ఈ రోజు ముగిసింది. 20 అంశాలతో ఐదు భాషల్లో డిక్లేరేషన్ ప్రకటించారు. 2004లో ఈ అంశాలన్నిటితో ముసాయిదా తయారు చేశామని ఇప్పుడైనా దానిని ఆమోదింప చేసుకొని అమలుపరిచినట్లయితే రైతులకు మేలు జరుగుతుందని మన విత్తనాలను మనం రక్షించుకోగలుగుతామని ఏం. కోదండ రెడ్డి అన్నారు. అలాగే విత్తన సంరక్షణలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కూరగాయలు ధాన్యాల విత్తనాలను భద్రపరిచి పంచుకునే విధానం తిరిగి పునర్జీవింప చేసుకోవాలని, మిశ్రమ పంటలతో ,పంట మార్పిడి విధానాలతో రైతులు వ్యవసాయం చేయాలని, ఇలాంటి అంశాలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి రైతు కమిషన్ను తెలంగాణలో ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ విత్తనం మూలం ఇదం జగత్ అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని అన్నారు. భూమి, నీరు, గాలి,ఆకాశం నిర్లక్ష్యానికి గురవుతోందని రైతులకు చెయ్యెత్తి జై కొట్టినప్పుడే పంచభూతాల పరిరక్షణ జరుగుతుందని, ఆకుపచ్చ విప్లవం రావాలని దానికి అన్మాస్ పల్లి ఎర్త్ సెంటర్ కేంద్రం అవ్వాలని ఆయన ఆకాంక్షించారు. విత్తనం పంట అనే వాగ్దానాన్ని ఇస్తుంది కనుక దానిని మనము పరిరక్షించుకోవాలని, త్వరలో రైతులు విత్తనం పై పాటలు రాసి దానిని ఒక సిడి రూపంలోకి తీసుకువచ్చేలా సిజిఆర్ తో కలిసి కృషి చేస్తానని సుద్దాల అశోక్ తేజ చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విధాన విశ్లేషకులు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి రచించిన 'ఆరోగ్యానికి ఆహారం భద్రతకు విత్తనం' పుస్తకాన్ని నాగిరెడ్డి ఆవిష్కరించగా మొదటి కాపీని సుద్దాల అశోక్ తేజ అందుకున్నారు. సిసిఆర్ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయ సంస్థల నిపుణులకు సర్టిఫికెట్ అందజేశారు.

**సిజిఆర్ తీర్మాణాలు.**

భవిష్యత్తు తరాల కోసం విత్తనాలు సంరక్షించడం పౌర సమాజం ద్వారా వికేంద్రీకృత పరిరక్షణ పునరుత్పత్తి భాగస్వామ్యం ద్వారా జీవవైవిధ్యం కోసం కృషి చేయడం. విత్తనాలు సంరక్షించి ఇచ్చిపుచ్చుకోవడం విత్తన సంరక్షణ వ్యాప్తిలో మహిళల పాత్రను విస్తృతపరచడం. వివిధ విత్తనాలు, వృక్షాలపై పేటెంట్ మేధో సంపత్తి హక్కు ఇచ్చే బాధ్యత విధానాన్ని వ్యతిరేకించడం. స్వదేశీ విత్తనాలన్నీ ప్రజల మధ్య ఉంచడం.దానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థించడం వంటి 20 అంశాలతో తీర్మానాన్ని ఆమోదింప చేశామని, అధికారికంగా త్వరలోనే వివిధ ప్రభుత్వాలకు సంస్థలకు అందజేసి ఈ అంశాలన్నీ అమలయ్యేలాగా సిజిఆర్ కృషి చేస్తుందని వ్యవసాయ నిపుణులు దొంతి నరసింహారెడ్డి ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ కళాశాల కరస్పాండెంట్ శాంతి వెదుల, వ్యవసాయ నిపుణుడు రామ్ నాథ్ శ్రీరామకృష్ణ, సిజిఆర్ వ్యవస్థాపకులు నీల లక్ష్మారెడ్డి ,మాజీ కమిషనర్ ఆర్.టి.ఐ ఆర్.దిలీప్ రెడ్డి, వినోబా సెరా ప్రతిష్ఠాన్, భువనేశ్వర్ మనోజ్ జెనా,వందేమాతరం ఫౌండేషన్ రవీందర్, రైతులు,విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు, సైంటిస్టులు,డాక్టర్లు పాల్గొన్నారు.




# కస్టమర్ షాక్...
# దోశ తింటుండగా బొద్దింక ప్రత్యక్షం

- ఇబ్రహీంపట్నం శ్రీ రాఘవేంద్ర ఉడిపి హోటల్ లో ఘటన
- ఫైన్ వేసిన మున్సిపాలిటీ అధికారులు
- శ్రీ రాఘవేంద్ర హోటల్ లో నాణ్యత కరువు



ఇబ్రహీంపట్నం,విశాలభారతి :

రంగారెడ్డి జిల్లాఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటల్ లో ఓ వ్యక్తి దోశ ఆర్డర్ చేసి , తింటుండగా దోశ లో బొద్దింక రావడంతో షాక్ అయ్యాడు. బాధితుడు హన్మంతు కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన హన్మంతు కుమార్ తన పిల్లలతో టిఫిన్ చేయడానికి మున్సిపాలిటీ లోని శ్రీ రాఘవేంద్ర హోటల్ కి వెళ్లి దోశలు ఆర్డర్ చేశాడు. దోశలను తినడం మొదలు పెట్టిన ఆయన పిల్లలు దోశలో బొద్దింకలు రావడంతో వారు అవాక్కయ్యారు. దీంతో బాధితులు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన మున్సిపాలిటీ ఎన్విరాన్మెంటల్ ఇన్స్పెక్టర్ ప్రణవ్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ సాయి రెడ్డిలు హోటల్ ను సందర్శించి రూ. 2500 ఫెనాల్టీ విధించారు. హోటల్స్ ను బయట నుంచి వివిధ రకాలుగా సుందరంగా జనాలను ఆకర్షించే విధంగా ముస్తాబు చేసి కిచెన్ లో మాత్రం నాణ్యత లేని పిండి పదార్థాలు, అపరిశుభ్రంగా ఉంచడంతో బొద్దింకలు, ఈగలు నిత్యం వస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు వాపోతున్నారు.



# ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

ఆమనగల్లు,విశాలభారతి:

ఆమనగల్లులో ఆదివారం బీజేపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ప్రతి ఇంటిపై బీజేపీ జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, కల్వకుర్తి నియోజకవర్గం అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ, నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ నెంబర్ చెక్కల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్స్ కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, కల్వకుర్తి నియోజకవర్గం బిజెపి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పద్మ ప్రశాంత్, మండలం బీజేవైఎం అధ్యక్షుడు వరికుప్పల శ్రీనివాస్,బిజెపి పార్టీ సీనియర్ నాయకులు బుచ్చయ్య, గోజె ఆనంద్, బాలు నాయక్, ప్రవీణ్, సాయిబాబా, శ్రీనివాస్,విజయ్, ఎర్రవోలు మహేష్, శ్రీశైలం, రాఘవేందర్, సక్రు నాయక్, జంగయ్య,శ్రీను యాదవ్, తోట మల్లేష్ యాదవ్,నరసింహ, ఎల్లయ్య,అంజి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేస్తాం
- మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్



విశాలభారతి,భీమదేవరపల్లి :

మండలంలోని ముల్కనూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసంఘ్ నుంచి 1980 ఏప్రిల్ 6 న శ్యాంప్రసాద్ ముఖర్జీ, ధీన్ దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్ పేయి, ఎల్కే అద్వానిల ఆధ్వర్యంలో బీజేపీగా అవతరించిందన్నారు. నేడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలన, 15 నెలల కాంగ్రెస్ పాలన ప్రజలను తీవ్ర ఇక్కట్లకు గురి చేసిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ నుండి జెడ్పిటిసి వరకు కాషాయ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్, జిల్లా నాయకులు మాచర్ల కుమారస్వామి, ఊసకోయిల కిషన్, పోడేటి బిక్షపతి, గుండెల్లి సదానందం, దొంగల వేణు, మహిళా నాయకురాలు అంబీర్ కవిత, కరుణాకర్ రెడ్డి, బండారి కరుణాకర్, బైరి సదానందం, శనిగరపు ఐలయ్య, లక్కిరెడ్డి మల్లారెడ్డి, దొంగల రాణా ప్రతాప్, బొజ్జపూరి పృథ్వీరాజ్, బైరి సదానందం, కాలేరు వికాస్, గద్ద రాజేందర్, నోముల బిక్షపతి, జ్ఞానేశ్వర్, మాడుగుల అజయ్, సిద్ధమల్ల రమేష్, గొల్లపల్లి నవీన్, బోడ రమేష్ తదితరు పాల్గొన్నారు.



# కళ్యాణి కైలాస క్షేత్రంలో కమనీయంగా శ్రీ సీతారాముల కల్యాణం

- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన పీవీ కుటుంబీకులు పీవీ మదన్ మోహన్

విశాలభారతి, భీమదేవరపల్లి:

భారతరత్న "మాజీ ప్రధాని" పి.వి.నరసింహారావు స్వస్థలం వంగర గ్రామ కైలాస కల్యాణి క్షేత్రంలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలను నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు పాత శివాలయం నుండి ఉత్సవ మూర్తులను కైలాస క్షేత్రం వరకు బాజా బజంత్రీల మధ్య తరలించారు. స్వామి వారికి పి.వి.కుటుంబీకుల తరపున పి.వి.మదన్ మోహన్ నూతన వస్త్రాలు బహుకరించారు. అదే విధంగా ముల్కనూరుకు చెందిన వస్త్ర వ్యాపారి చిదురాల అర్జున్ స్వరూప, సురేశ్ కూడ వస్త్రాలు సమర్పించారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమంలో వంగర ఎస్సై గొల్లపల్లి దివ్య, అర్.వెంకటరెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీరామోజు మొండయ్య, ఒల్లాలరమేశ్, బుచ్చిరెడ్డి, ఊసకోయిల ప్రకాశ్, కుమార స్వామి, బికె లక్ష్మీనారాయణ, కొండల్, తిరుపతి రెడ్డి, మల్లారెడ్డి, జనార్ధన్, పెరుమాల్లరవి, బిజెపి నాయకులు రామోజు శ్రీనివాస్, చంద్రారెడ్డి, కాల్వ సంపత్, ఆవుల రాజయ్య, మారెం సతీష్, గిన్నారపు కుమార్, అనీల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావాలి గందోత్సవం

ఆమనగల్లు,విశాలభారతి:

అమనగల్లు పట్టణంలో శనివారం రాత్రి హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావాలి గందోత్సవాన్ని పట్టణంలోని మైనార్టీ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా , మీర్జా అలీబెగ్, సయ్యద్ ఖలీల్, ఎండిమౌజమ్,చాంద్ పాష ల ఇంటి నుండి బయలుదేరిన గంధంలో పెద్ద సంఖ్యలో ముస్లీం సోదరులు పాల్గొని పుర వీదులగుండ గందోత్సవంతో భారీ ర్యాలీ నిర్వహించారు. నారే తక్బీర్ నారే రీసాలత్ అంటూ నినాదాలు చేశారు అనంతరం హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావాలి దర్గా వద్దకు గందోత్సవాన్ని తీసుకువచ్చి సమర్పించారు మౌలానా అబ్దుల్ వాహెద్ , మౌలానా అబ్దుల్ కరీం, ఆధ్వర్యంలో ప్రత్యేక దువ్వ ప్రార్థనలు, సాలామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మొహమ్మద్ మాసూమ్,మహబూబ్,ఫారుఖ్, జబ్బార్, జలాల్, బాబా షర్ఫుద్దీన్, ఖాదర్ ఖాద్రి, షేక అహ్మద్, రజాక్, మజీద్ ఖురేషి, జహంగీర్, షఫీ ఉల్లా, నిజముద్దీన్ బాబా, కరీం, ఇస్మాయిల్, అజీమ్, హనీఫ్, సాజిద్ , ఇమ్రాన్, అకరం, అన్వర్,బాబా, రావూఫ్, అహ్మద్, ముదస్సిర్, తదితరులు ఉన్నారు

# తాళ్ల ఖమ్మంపహడ్ లో ఘనంగా రాములోరి కళ్యాణం

- కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖ సినీ నిర్మాత రవింధర్ రెడ్డి నవ్య దంపతులు



సూర్యాపేట,విశాలభారతి:

శ్రీ రామనవమి పండగను పురస్కరించుకొని ఆదివారం సూర్యాపేట మండల పరిధిలోని తాళ్ల ఖమ్మంపహడ్ గ్రామంలో గల కోదండ రామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ప్రముఖ సినీ నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి నవ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి చంద్రకళ దంపతులు, మిర్యాల సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వీరబాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
07.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**విశాలభారతి,ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్స్ బోర్డ్ సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నీరా కేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

**ఆమనగల్లు,విశాలభారతి:**

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ కర్నూల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అమనగల్లు పరిధిలోని కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో నిరా తయారీ కేంద్రాన్ని ఆదివారం అమనగల్లు సర్కిల్ సిఐ బద్యనాథ్ చౌహన్ తో కలిసి సందర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో నిరా తయారీ చేస్తున్న సందేహాలను, లాభాలను అధికారులను, గీతా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకొచ్చిన నీరా ఎలా తీసుకుంటున్నారు.దానికి కావాల్సిన రవాణా, ఉష్ణోగ్రత చేస్తున్నారని,ఎ ఎ గ్రామాలలో నీరా ప్రొడక్షన్ జరుగుతుందని కనుకున్నారు. నీరా నుండి వచ్చే లాభాలు ఎలా తయారు చేయాలి,వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, నీరా రుచిని సేవించి,రాష్ట్రంలో కూడా తప్పకుండా అతి త్వరలో ఈత, తాటి కల్లు నుంచి నిరా యొక్క కేంద్రం అమలయ్యేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమలో ఇన్స్పెక్టర్ అరుణ్ కుమార్,సబ్ ఇన్స్పెక్టర్ బాబు పాల్గొన్నారు



# అంతా రామమయం..

- **వీధివీధిన రాములోరి కళ్యాణ వేడుకలు.**
- **వేద మంత్రోచ్చరణతో కమనీయం కళ్యాణం**

**సూర్యాపేట, విశాలభారతి:**

శ్రీరామనవమి వేడుకలతో ఆదివారం సూర్యాపేట అంతా రామమయమైంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన దేవాలయాలైన శ్రీవేదాంత భజన మందిరం, శ్రీ విజయాంజనేయస్వామి దేవాలయం, శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయం, శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు పట్టణంలోని నల్లాలబావి సెంటర్, విద్యానగర్ చౌరస్తా, అలంకార్ సెంటర్ చౌరస్తాలో, 45వవార్డు రామలింగేశ్వర థియోటర్ చౌరస్తాతో పాటు పట్టణంలోని వాడవాడల భక్తులు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా వేద మంత్రోచ్చరణ నడుమ వైభవనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీలు ఆయా మండపాలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళ తాళాతో భారీ ఉరేగింపుగా తీసుకవచ్చారు. శ్రీ విజయాంజనేయస్వామి దేవాలయంలో మైనార్టీ నాయకులు , మాజీ కౌన్సిలర్ ఎస్ కె జహీర్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణశ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఉప్పల లలీత ఆనంద్, కృష్ణవేణి, అజిత, మంజుల, దేవిక, ఆవుల పద్మ పాల్గొన్నారు.



## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

**బాల్కొండ,విశాలభారతి:**

శ్రీరామనవమి సందర్భంగా మాజీ మంత్రి ,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దంపతులు వేల్పూర్ మండల కేంద్రంలోని రామాలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం పోచంపాడ్ లోని కోదండ రామాలయంలో స్వామివారి కళ్యాణోత్సవంలో ఆయన సతి సమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి అన్నదానం కోసం కావాల్సిన సామాగ్రిని,ఈ సంవత్సరం కూడా ఎమ్మెల్యే వేముల వితరణ చేశారు.అన్నదాన సత్రంలో భక్తులకు కాసేపు ఎమ్మెల్యే వేముల భోజనం వడ్డించారు.



# కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఆర్మూర్ ,విశాలభారతి:**

ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కంఠం గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి డైరెక్టర్ పెంట ఇంద్రుడు మాట్లాడుతూ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర మరియు రూ. 500 బోనస్ పొందాలని రైతులకు సూచించారు. రైతులకు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిరంజీవి బిజెపి సీనియర్ నాయకులు మేర రాములు, దారం రాజు, గుండ్ల పోశెట్టి, దారం పోశెట్టి ఐకే పి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.







# లొద్ది రామన్న కల్యాణ వేడుకల్లో పాల్గొన టిపిసిసి చీఫ్

- **లొద్ది రామాలయం,లింబాద్రి గుట్ట అభివృద్ధికి కృషి**
- **రహత్ నగర్ ఆలయానికి రూ.50లక్షలు మంజూరు**
- **టిపిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్యే బోమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**బాల్కొండ,విశాలభారతి:**

లొద్ది రామాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం శ్రీరామనావమి సందర్భంగా ఆయన బాల్కొండ నియోజకవర్గం భీమ్గల్ మండలం పిప్రి గ్రామంలోని లొద్ది రామాలయంలో కుటుంబ సభ్యుల తో కలిసి రాములవారి కల్యాణ వేడుకల్లో పాల్గొని, స్వామివారికి పూజలు నిర్వహించారు.ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ దంపతులు,రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హమ్దాన్,ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి సారి బాల్కొండ నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఆయనకు బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ సునీల్ కుమార్ అలాగే పార్టీ శ్రేణులు వేల్పూర్ X రోడ్డు దగ్గర ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి దాదాపు 100 కార్లతో ర్యాలీగా టిపిసిసి చీఫ్ సొంత మండలం భీమ్గల్ కు బయలు దేరారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమలతో ఘనస్వాగతం పలికారు.స్థానిక సెంటర్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిప్రి లొద్ది రామాలయానికి బయలుదేరి రాములవారికి పట్టు వస్త్రాలు సమర్పించి,కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు .ఈ సందర్భంగా రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్కుమార్ గౌడ్ మాట్లాడుతూ 1969లో ఈ ఆలయాన్ని తన తండ్రి బొమ్మ గంధర్ గౌడ్ నిర్మించారని తెలిపారు.ఈ రామాలయం అంటే మా కుటుంబానికి ఎంతో నమ్మకమని తెలిపారు.మొదటి సారిగా ఈ రామాలయంలో సీతారామల కళ్యాణం వేడుకలో పాల్గోనడం చాలా సంతోషంగా, ఆనందంగా ఉందన్నారు.ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో లొద్ది రామాలయం, లింబాద్రి గుట్ట అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.తన సొంత గ్రామమైన రహత్ నగర్ లోని లలిత దుర్గా ఆలయం అభివృద్ధికి కోరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50లక్షల ప్రొసీడింగ్స్ ని ఆయన గ్రామస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణాన్ని దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు ఫట్టు వస్త్రములు అలంకరింపజేసి శాస్త్రోక్తంగా మాంగల్య దారణ తంతును ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలెంల కు చెందిన భక్తుడు గోటితో తీసిన బియ్యాన్ని తలంబ్రాలుగా పోశారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివాహం కాని వారికి శీఘ్రముగా కళ్యాణం జరుగుటకు కళ్యాణ కంకణాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మండ్ల పల్లి మురళీధర్ కోశాధికారి పాలవరపు రామమూర్తి ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్ అన్నదానం నిర్వాహకులు దేవర శెట్టి సోమయ్య, బ్రాహ్మండ్లపల్లి దేవి దత్తు, ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, ముదిరెడ్డి లింగారెడ్డి, నూక ముత్యాలమ్మ, చిల్ప అశ్విని కుమార్, ఓరుగంటి జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

- **ముల్కనూర్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి దంపతులు**

**విశాలభారతి,భీమదేవరపల్లి :**



శ్రీరామ నవమి వేడుకలను మండల ప్రజలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువుగా అర్చకులు జరిపించారు. ముల్కనూర్ శ్రీ సాంబమూర్తి స్వామి దేవాలయంలో అర్చకులు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి దంపతులు, గన్ను శ్రీనివాస్, కోడూరు సరోజన, వంగ రవీందర్ పాల్గొన్నారు. భీమదేవరపల్లి భీమేశ్వర ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం జిల్లా బిజెపి నాయకులు మాచర్ల కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా చేయడం జరిగినది. ముత్తారంలో అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో శిలగాని సోదరుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గట్లనర్సింగాపూర్, కోదండరామస్వామి ఆలయంలో, కొప్పూర్ గద్దల బండ పంచముఖ హనుమాన్ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



## తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు అంబాల ఆర్య రాజ్

**విశాల భారతి, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల కేంద్రంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల చేరాలు, మరియు హనుమకొండ జిల్లా కో కన్వీనర్ సాతూరి రాజమౌళి, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొర్రె థామస్, గార్లు హాజరు కావడం జరిగింది మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ గా పాక రమేష్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేయడం జరిగింది, మరియు ప్రధాన కార్యదర్శిగా అంబాల నాగేష్(DJ), డైరెక్టర్లుగా ఆరేపల్లి చంద్రమౌళి, గొర్రె తిరుపతి, మంద కుమారస్వామి, జన్ను వినోద్, ఎర్రోళ్ల రాజేష్ గార్లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల మాజీ చైర్మన్ నార్ల గిరి శ్రీనివాస్,సాతూరి చంద్రమౌళి, ఎర్రోళ్ల జగన్, గడ్డం సంజీవ్, కామెర లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**బాల్కొండ,విశాలభారతి:**

భీమ్గల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 45వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు సంధ్యా రాజు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కనికరం మధుగారు మాట్లాడుతూ...రాబోయే మున్సిపల్ ఎలక్షన్లో భీమ్గల్ మున్సిపాలిటీని తప్పకుండా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు బండారి లక్ష్మణ్ గౌడ్,పతాని ప్రవీణ్,దయ ప్రవీణ్,చిన్ని నర్సయ్య,నర్సయ్య యాదవ్, నరేందర్ గౌడ్,నవీన్,లింబాద్రి, గంగాధర్,అజయ్,గణ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా



cinema updates





## 'పెద్ది'.. తొలి షాట్ అదిరింది!

సెప్పాడంటే.. సేసి సూపిస్తాడట 'పెద్ది'! మరి మైదానంలో అతని ఆట ఎలా సాగిందో తెలియాలంటే వచ్చే ఏడాది వేసవి వరకూ ఆగాల్సిందే. రామ్‌చరణ్ కథానాయకుడిగా.. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ప్రచార చిత్రాన్ని శ్రీరామనవమి సందర్భంగా 'ఫస్ట్ షాట్' పేరుతో ఆదివారం విడుదల చేశారు. 'ఒకే పని సెసేనాకి... ఒకే నాగ బతికేనాకి... ఇంత పెద్ద బతుకెందుకు? ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పడే సేసెయ్యాల... పుడతామా యేటి మళ్లీ!' అనే సంభాషణలతో మొదలయ్యే ప్రచార చిత్రం ఆసక్తిని రేకెత్తించింది. క్రీడా నేపథ్యంలో సాగే కథ ఇది. పెద్ది పాత్రలో రామ్‌చరణ్ బ్యాట్ పట్టుకుని చేసిన సందడి, ఆయన కొట్టిన షాట్, ఉత్తరాంధ్ర యాసలో సంభాషణలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 27న విడుదల చేస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రకటించింది చిత్రబృందం. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్.రెహమాన్, ఛాయాగ్రహణం: ఆర్.రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా, కూర్పు: నవీన్ నూలి.

## పోరాటంతో మొదలు..



'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందనున్న పాన్ ఇండియా సినిమా 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా ఈనెల మూడో వారం నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ తొలి షెడ్యూల్‌లో భాగంగా నానితో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించనున్నట్లు సమాచారం. దీనికోసం భాగ్యనగరంలోనే ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇది హైదరాబాద్ కేంద్రంగా సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా కథాంశంతో ముస్తాబు కానుంది. ఇందులో నాని మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో.. వినూత్నమైన లుక్‌తో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 26న థియేటర్లలోకి రానుంది.

## బేబీ బ్యూటీ ఫస్ట్ క్రష్ ఎవరో తెలిస్తే షాకే!

బేబీ బ్యూటీ.. అదేనండీ వైష్ణవి చైతన్య.. బేబీ సినిమాతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చిన అమ్మడు ఓ రేంజ్ లో క్రేజ్ సంపాదించుకుంది. ఓవర్ నైట్ స్టార్ గా మారిన ముద్దుగుమ్మ.. రీసెంట్ గా లవ్ మీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా అనుకున్నంత స్థాయిలో హిట్ దక్కలేదు. ఇప్పుడు పలు చిత్రాలతో బిజీగా ఉంది బ్యూటీ.టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కించిన జాక్ మూవీతో మరో నాలుగు రోజుల్లో సందడి చేయనుంది వైష్ణవి చైతన్య. రొమాంటిక్ యాక్షన్ జోనర్ లో రూపొందిన ఆ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో వాటిని ఇంకా పెంచేందుకు మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారువైష్ణవి కూడా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమాను ప్రమోట్ చేస్తోంది. అదే సమయంలో రీసెంట్ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకుంది. తన ఫస్ట్ క్రష్ హీరో రామ్ పోతినేని అని తెలిపింది వైష్ణవి. హీరోయిన్స్ విషయానికొస్తే.. అనుష్క, సాయి పల్లవి తన ఫేవరెట్ అంటూ చెప్పుకొచ్చింది. అయితే తన ఫస్ట్ రెమ్యునరేషన్ రూ.3 వేలు అని చెప్పింది వైష్ణవి. సహజనటి జయసుధతో చిరంజీవి పోల్చడం జీవితంలో తనకు మర్చిపోలేని ప్రశంసట. 18 ఏళ్ల వయసులో ప్రేమలో పడిందట అమ్మడు. కానీ కొన్ని కారణాల వల్ల బ్రేకప్ అయిందు. కానీ తన ఫస్ట్ లవ్ ఇప్పటికీ ఎప్పటికీ సమ్ థింగ్ స్పెషల్ అని చెప్పడం విశేషం.బేబీ మూవీ తర్వాత ఆమెకు క్రేజ్ పెరగడమే కాదు.. అభిమానుల నుంచి ప్రపోజల్స్ బీభత్సంగా వచ్చాయని ఇంటర్వ్యూలో చెప్పింది వైష్ణవి. అంతే కాదు తాను అబ్బాయిల్లో మొదటగా కళ్లు, నవ్వు మాత్రమే గమనిస్తానని తెలిపింది. కూచిపూడి, పాశ్చాత్య నృత్యంలో వైష్ణవికి మంచి ప్రావీణ్యం ఉందట. పాటలు కూడా బాగా పాడుతుందట.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.